# వియ్యాని కొకదారి

రాయసం వెంకటశివుడుగారు

క్రొత్తపాఠశాలకుఁబోవుట సీతకు నాఁడే మొదలు. నాలుగవతరగతి యుండుచోటికి వెళ్లి నిలుచుండఁగా, అచట శారద యామెను కుశల ప్రశ్న చేసెను. సీతకుఁ గోపమువచ్చెను. అపుడా యిద్దఱికిని జరిగిన సంభాషణమిది:—

శారద: "నీ పేరిమిటి?"

సీత: "నాపేరు నీ కెందుకు?"

శారద: "పేరడిగితేనే కోపమెందు కమ్మా! పేరుచెప్పితేనే అందం వాలికి పోతుందా యేమి?"

సీత: "అందరూ నీవలె అందాన్ని బిగ బట్టి వుంచుకోగలరా? ఊరికేవుండలేక, ఊరందరినీ పేరడుగుతావెందుకు?"

శారద: "నా పేరడిగితే నేను జెప్పనా? నీవలె మూతివిరుస్తానా?"

సీత: "అయితే అడుగుతున్నాను నీ పేరుచెప్పు?"

శారద: "ఇంతకుముందడిగితే నేజెప్పే దానినే.నీవేచెప్పనప్పుడు నేనెందుకు చెపుతా నమ్మా!"

సీత: "ఇపుడు తెలిసిందా నీసంగతి! అడిగేదానికి, చెప్పేదిలోకువ!"

శారద: "అయితే నాపేరిప్పుడు చెపుతా విను శారద."

సీత: "నేనూ ఇపుడేచెపుతాను సీత."

ఒకరి బలాబలములొకరు మొదటనే పట్టిచూచిన యోధులవలె సీతా శారదలు నాఁటినుండియును మనసుకలిసిన చెలిమిచే నలరారుచుండిరి!

స్వాభావికముగా సీత మితభాషిణి— శారద మాటకారి. పచ్చని శరీర కాంతితో నొప్పుచుండును. చామనిచాయ మేనుతోనుండు సీత అందమునఁ దన నెచ్చెలికిఁదీసి పోవునదికాదు. సీత సంగీతమున మిన్న. శారద యాభిమానవిద్య చిత్రలేఖనము. వారియందిట్టి గుణభేదములు గానవచ్చినను, వారి హృదయములందు చెలిమియె వెలసియుండెను. సీతా శారదలు మబ్బుమెఱుపులవలె సన్యోన్యానురాగమున విలసిల్లువారు ఒకచోటనే గూర్చుండి చదువుకొనువారు ఒక ప్రదేశమున నేయాడుకొనువారు చదువునందు సద్వర్తనమునందును తరగతి కిరువురును మేలుబంతివలె నుండి చిలుక గోరువంకలవలె నన్యోన్య ప్రేమతో నొప్పుచుండిరి.

సౌఖ్యదినములు చైత్రకాలపు నిగనిగలవలె వేగమవన్నెవాయును. ఇపుడు గృహస్థ జీవితము వేవేగమె తమ్ముఁదరుముకొని రాఁగా, సీతా శారద లొండొరులను, విద్యాశాలను విడనాడిపోవలసిన వారైరి ఒకరిక్షేమ సమాచారములు తుదకు నివాసస్థలమైనను, ఒకరికిఁదెలియకయె మాసములు వత్సరములును గడచిపోయెను.

ఒకనాఁడు రెయిలుబండ్లాలస్యముగ వచ్చుటచేత [illegible] స్టేషనులో నిర్బంధ[illegible]

వచ్చెను. సీత కొడుకు పదేండ్లవాఁడు, ఆటలయందపేక్షచేత చేరువనుండు నొక బాలికచెంత కేగియుండెను. తమ బండి వచ్చెడి సమయమగుటవలన ఆటల మఱఁగిన కుమారునిఁదోడి తెచ్చుటకై, తన పిల్లవానియొద్దకు సీతవెళ్లి, దాపున పండు కొనియున్న యొక స్త్రీ ముఖమును తేరిపారి చూచెను. ఒక నిముసములోనె యీ స్త్రీ లొకరి నొకరానవాలుపట్టి, కౌఁగలించు కొని సంతోషమునఁదేలిరి. సీత కిపుడుగాన వచ్చినది యామె బాల్య సఖియగు శారదయె! వారపుడు తమబాల్య దినములు జ్ఞప్తికిఁదెచ్చుకొని, ఆనందపరవశలయిరి. కొలఁదినిమేషములలోనె వారు వేర్వేరు రెయిలుబండిలో గూర్చుండిరి. కాని, సీతా శారదలు ఒకరినుండి యొకరు వీడ్కోలు గైకొనుటకు ముందుగా దైవానుగ్రహము నఁదమపిల్లలీ యిరువురును పెరిఁగి పెద్దవారయిన ఇద్దఱికిని బెండ్లిచేసి తాము ధన్యులమయ్యెదమని నిశ్చయించుకొనిరి! హిందూ స్త్రీల కత్యంత సంతోషదాయకమగునవి తమ పిల్లలపెండ్లి ముచ్చటలేగదా!

భరతదేశమున నతిబాల్య వివాహముల నరికట్టుట కుద్దేశింపఁబడిన "శారదాశాసనమె" అతిబాల్య వివాహములు ప్రథమమున నొక్కుమ్మడిగ జరుగుటకు మొదటి కారణమయ్యెను! ఐనను, ధీరమతులు, విద్యావంతులును, పామరజనులుపెట్టు బాధలు లెక్కసేయక, తమపిల్లలకు వయస్సువచ్చిన పిమ్మటనే పెండ్లితలపెట్టుదుమని దృఢ నిశ్చయులయియుండిరి. ఇట్టి వారిలో ముఖ్యులు సీతయు నామె పతియును. వీరు తమ పుత్రున కున్నతవిద్య చెప్పించు ప్రయత్నముననేయుండి వివాహముసంగతి యాలోచింపరైరి. దీనికిఁ దోడుగ వీరి కుమారుఁడు ప్రభాకరము చదువునందే శ్రద్ధవహించి, తాను విద్యాపరిపూర్తియగువఱకును వివాహముచేసి కొనననిచెప్పివేసెను. ఇపుడాతఁడు పదునెనిమిదివత్సరములుదాటి పెద్దపరీక్షలిచ్చియున్నను తాను ఉద్యోగ స్వీకారము చేయువఱకును పరిణయముగాననియు ఆ పిమ్మట తనపని ఖాయమగువఱకు వివాహముచేసికొనననియును తన పెండ్లికి వాయిదాలు వేయుచుండుట తలిదండ్రులకుఁ గొంత గుండెదిగులు గలిగించినను కొలఁదికాలముననె యతఁడు వివాహమునకు సుముఖుఁడగునని యువ్విళులూరుచు సీతయు భర్తయు నాని మనస్తత్వమునుగని పెట్టుచుండిరి.

ప్రాజ్ఞతవచ్చిన పుత్రునిమీఁద ననగత్యముగఁ దమ యధికారము చెల్లింపఁబూనక ఆతనిదండ్రులు పెండ్లిమాటలతోఁదమ తనయుని విసిగింపక అతఁడు ఋజుమార్గమున నడచునట్లు మాత్రము చూచుచుండిరి. ఒకనాఁడు ప్రభాకరము తనతల్లి సీతతో ముచ్చటించుచు తాను జూచివచ్చిన సభలోని కార్యక్రమమును వర్ణించి విద్యావతియగు నొకబాలిక యచట మధురగానము చేసెనని చెప్పెను. ఇంకొకపరి యాతఁ

డచటి యువతీవిద్యాలయ వార్షికసమయ మునఁ బ్రదర్శింపఁబడిన నాటకమునుగుఱించి జననితోఁ మాటాడుచు వెనుకటి విద్యావతి యీమాఱు గావించిన ప్రసంగము మిగుల హృద్యముగ నుండెనని చెప్పెను. సంభాషణా సందర్భమున నిట్లు సీత తన తనయుని కాబాలయందు మక్కువ గలుగుచున్నదని గ్రహించి యామె వృత్తాంతము మెల్లఁగఁగని పెట్టుచుండెను. కాని, యాబాల యచట విద్యాపరిపూర్తిచేసి తన దలిదండ్రులుండు చోటికి వేగమె వెడలిపోవుటచేత సీత కామె వర్తమానము పూర్తిగఁ దెలియదయ్యెను.

ఇంక కుమారునికి జిన్ననాఁడే పెండ్లి చేయకుండుటకై సీతపడిన కష్టముకంటె కొమార్తె కతిబాల్య వివాహము తప్పించు విషయమై శారదపడిన శ్రమయధికమైనది. శారద తన బాల్యసఖియగు సీతను మరచి పోలేదు. సీత పుత్రుఁడును విద్యావంతుఁడునునగు ప్రభాకరునకుఁదగిన యిల్లాలినిగఁ దనకొమార్తెను సంసిద్ధపఱచుటకై కమలకు దూరప్రదేశమందలి యువతీ విద్యాలయములో శారదయున్నత విద్య చెప్పించెను. సీత కొడుకు విద్యా పరిపూర్తిచేసెనని కొంతకాలము క్రిందటనే తెలిసినను అతఁడు వివాహమునకు విముఖుఁడని శారద వినెను. దీనికిఁదోడుగా అతఁడిపుడు ఉద్యోగస్థుఁడై దూరదేశమేగెనని వార్తకూడ వచ్చెను. కాని యెంతసుంది నడిగినను ప్రభాకరుఁడుండుచోటు సీతకుఁదెలియకుండెను. ఐనను తన కొమార్తె విద్యకు విఘ్నము గలుగకుండునట్లుగ యుక్తవయస్సువచ్చిన వెనుకనే పుత్రికయభీష్టమునననుసరించి యామెకుఁ బరిణయము గావింప శారదయుద్యమించెను.

ఇచట సీత తన కుమారుని మనస్సునకు నచ్చిన కమల యునికిపట్టి తెలిసికొనవలెనని చేసిన కృషియెట్టకేలకు ఫలించెను. కమలనుజూచి వచ్చిన బంధువులు తెలిపిన వార్తలు సీతను ప్రభాకరుని ఆశ్చర్యమున ముంచివైచెను. చిన్నవాఁడు కన్నువైచిన బాలయు తాను విద్యనేర్చు పురముననె నివసించియుండు ప్రభాకరుని గొన్ని పౌరసభలలోఁజూచి ఆతని శీలమును గుఱించి జనులకుఁగల సదభిప్రాయమెఱిఁగినది గావున ఆ యువకునే ప్రేమించియుండెనఁట! శుభము వెంట శుభము చేకూరుచుండును. వధూవరుల తల్లులు సీతా శారదలు, చిరకాలమునుండి తమ వియ్యమునకు కెదురుచూచుకొనుచుండుటచేత కమలా ప్రభాకరుల పాణిగ్రహణమహోత్సవము శీఘ్రమె జరిగి అందఱికినిసంతోషదాయకమయ్యెను.

పిల్లల పరస్పర ప్రేమమూలమున పెద్దల చిరకాలపుఁగోర్కెలిట్లు సులభముగ సఫలీకృతమయ్యెను. ప్రేయసీప్రియులకు ప్రేమబంధమును గల్పించి పెంచి పరిణయముగఁ బరిణమింపఁజేసిన నిధిప్రేరణ తమ సత్సంకల్పమునకు విచిత్రముగఁదోడ్పడెనని యిప్పటికిని సీతా శారద లాశ్చర్యమునఁ జెప్పుకొనుచున్నారు!